www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 1 మార్చి 2024
5
అన్నమయ్య



'మిట్స్'కు ఐఎస్ఒ సర్టిఫికెట్


ఐఎస్ఒ సర్టిఫికెట్ చూపుతున్న ప్రిన్సిపల్ యువరాజ్

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లె సమీపంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలకు ఐఎస్ఒ (21001:2018) సర్టిఫికెట్ వచ్చినట్లు ప్రిన్సి పల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. గురు వారం ఆయన మాట్లాడుతూ ఎడ్యుకేషనల్ ఆర్గనై జేషన్స్ మేనే జ్‌మెంట్ సిస్టమ్స్(ఇఒఎంఎస్) పాలసీ సర్టిఫికేషన్‌ను పొందిందన్నారు. కళాశాలలోని బోధన, అభ్యాసం, మూల్యాంకనం, పరిశోధనలు మొదలైన వాటితో కూడిన అన్ని కార్యక్రమాలలో విద్య యొక్క నిరంతర మెరుగుదల ప్రక్రియ ద్వారా మిట్స్ కళాశాల నాణ్యత పెంపుదలను దృష్టిలో ఉంచుకొని ఈ గుర్తింపును టియువిఎస్‌యుటి వారు అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ గుర్తింపు 2027 వరకు లభించినట్లు చెప్పారు. ఈ గుర్తింపునకు దోహదపడిన కళాశాల అధ్యాపకులకు, విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు కళాశాల కరెస్పాండెంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల కృతజ్ఞతలు తెలియజేశారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం


ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన బల్లలు

- నేటి నుంచి ప్రారంభం
- పరీక్షలు రాయనున్న 26,634 మంది విద్యార్థులు
- జిల్లా వ్యాప్తంగా 54 కేంద్రాలు ఏర్పాటు
- ఒక్క నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

ప్రజాశక్తి - రాయచోటి

ఇంటర్మీడియట్ పరీక్షలు శుక్రవారం ప్రారంభంకానున్నాయి. జిల్లా వ్యాప్తంగా 150 ప్రభుత్వ, ప్రయివేట్ జూనియర్ కళాశాలలున్నాయి. ఇందులో ప్రభుత్వ 24, ఎయిటెడ్ 1, ఎపి ఆర్‌జెసి 2, మోడల్ స్కూల్ 17, కెజిబివి22, ఒకేషనల్ 11, సోషల్ వెల్ఫేర్ 10, హై స్కూల్ 4, ఎంజెఆర్ ఎపి 1, ప్రయివేట్ 57 జూనియర్ కళాశాలలున్నాయి. జిల్లా వ్యాప్తంగా 26,634 మంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నారు. ఇందులో మొదటి సంవత్సరం 14, 731, ద్వితీయ సంవత్సరం 11,903 మంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నారు. మొదటి సంవత్సరం లో బాలురు 7,196, బాలికలు 7,535, ద్వితీయ సంవత్సరంలో బాలురు 5,871, బాలికలు 6,032 మంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 54 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. 26 ప్రయివేట్ కళాశాలలు, 28 ప్రభుత్వ కళాశాల్లో ఏర్పాటు చేస్తున్నారు.

ప్రతి విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ పరీక్షలు అత్యంత కీలకమైనవి. ఉత్తమ ఫలితాలు సాధించడానికి విద్యార్థులు ఎవరికివారే పుస్తకాలతో కుస్తీపడుతున్నారు. మరో వైపు శుక్రవారం నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానుండటంతో జిల్లాలో ఎంపిక చేసిన కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించారు. పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. గురువారమే ఆయా కేంద్రాల్లో విధులు నిర్వహించే సిబ్బంది చీఫ్ సూపరింటెండెంట్లను కలిసి రిపోర్టు చేశారు.

పరీక్ష టైమ్ టేబుల్ వివరాలు..

ఇంటర్మీడియట్ పరీక్షలు శుక్రవారం నుండి 20 వరకు, ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయి. 1, 2వ తేదీలలో మొదటి, ద్వితయ సంవత్సరం విద్యార్థులకు ద్వితీయ భాష పరీక్ష, 4, 5 తేదీలలో మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఆంగ్ల బాషా పరీక్ష, 6, 7వ తేదీల్లో మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు గణిత శాస్త్రం-1 ఎ, 2 ఎ, వృక్ష శాస్త్రం 1, 2, పౌరశాస్త్రం 1, 2, 9, 11 తేదీలలో మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు గణిత శాస్త్రం 1 బి, 2 బి, జంతు శాస్త్రం 1, 2, చరిత్ర 1, 2, 12, 13వ తేదీలలో భౌతిక శాస్త్రం 1, 2 అర్థశాస్త్రం 1, 2, 14, 15 తేదీలలో మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు రసాయన శాస్త్రం 1, 2, వాణిజ్య శాస్త్రం 1, 2, సమాజ శాస్త్రం 1, 2, లలిత కళలు-సంగీతం 1, 2, 16, 18వ తేదీలలో మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రభుత్వ పాలన శాస్త్రం 1,2, తర్క శాస్త్రం 1, 2, బ్రిడ్జ్ కోర్స్-గణిత శాస్త్రం (బిపిసి విద్యార్థుల కొరకు),19,20 తేదీలలో మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఆధునిక భాషా 1, 2, భౌగోళిక శాస్త్రం 1, 2 జరుగుతాయి.

చీఫ్ సూపరింటెండెంట్ ఆఫీసర్లు 54, అడిషనల్ స్టాప్ సూపరింటెండెంట్లు 26, ఫ్లేయింగ్ స్క్వాడ్ ముగ్గురు, 1065 ఇన్విజిలేటర్లను నియమించారు. ఇటీవల కాలంలో కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ అన్ని అధికారులతో జిల్లా అన్ని శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పరీక్ష జరిగే సమయంలో ఉదయం, మధ్యాహ్నం ఆర్టీసీ బస్సును సౌకర్యాలు కల్పిస్తున్నారు. పరీక్ష సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా అన్ని చర్యలు తీసుకున్నారు. ప్రతి సెంటర్‌లో ఎఎన్‌ఎం, తాగునీరు మౌలిక వసతులు కూడా ఏర్పాటు చేశారు.

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తాం

శుక్రవారం నుంచి జరిగే ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం. కేంద్రాల వద్ద జిరాక్స్ సెంటర్లను కూడా మూసివేస్తున్నాం. సిసి కెమెరాలు కూడా ఏర్పాటు చేశారు. జిల్లా, రాష్ట్రస్థాయిలో అధికారులు సిసి కెమెరా ఫుటేజ్‌లో పర్యవేక్షిస్తారు. సెంటర్లోకి విద్యార్థులు 30 నిమిషాలు ముందుగానే హాజరు కావాలి. విద్యార్థులకు ప్రతి సెంటర్లో కావాలసిన మౌలిక సదుపాయాలన్నీ ఏర్పాటుచేశారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంది. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్ష రాసి అన్నమయ్య జిల్లాను రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలపడానికి అందరూ ప్రశాంతంగా పరీక్షలు రాయాలి. ఏమైనా సమస్యలు ఉంటే విద్యార్థులు 14416 లేదా 1800914416 నంబర్‌కు సప్రదించగలరు.

- ఎం.కృష్ణయ్య, డిఐఇఒ, రాయచోటి.

వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత

- వంద పడకల ఆస్పత్రి ప్రారంభోత్సవంలో ఎంపీ మిథున్‌రెడ్డి


ఆస్పత్రి ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి

ప్రజాశక్తి-పీలేరు

దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి వైద్యరంగానికి అధిక ప్రాదాన్యతనిస్తూ పేదలకు మెరుగైన వైద్యసేవలందిస్తున్నారని లోక్‌సభ ప్యానల్ స్పీకర్, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం పీలేరు ప్రభుత్వ ఆస్పత్రిని 50 నుంచి 100 పడకలకు పెంచుతూ రూ.24 కోట్లతో నిర్మించిన నూతన భవనాలను మిథున్‌రెడ్డి, కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ప్రారంభించారు. ఈ సందర్భంగా మిథున్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వైద్య రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తూ వైద్య అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. గతంలో రేషన్‌కార్డు, పెన్షన్లు కావాలంటే ప్రజలు కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగేవారని నేడు సచివాలయ, వాలంటీర్ల, వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలు పేదల ముంగిటకు చేరుతున్నాయని పేర్కొన్నారు. గతంలో పీలేరు పట్టణంలో ప్రజలు నీటి సమస్యతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనే వారిని ప్రస్తుతం నీటి సమస్య పూర్తిగా నివారించామని చెప్పారు. వాటర్ గ్రిడ్ పథకం ద్వారా ప్రతి ఇంటికి పైప్‌లైన్ కనెక్షన్ ఇస్తామని తెలిపారు. కనీవినీఎరుగని రీతిలో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయడం జరుగుతుందని ఈ పథకాలు ఇలాగే కొనసాగాలంటే ప్రతి ఒక్కరు ప్రభుత్వానికి సహకరించాలన్నారు. కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ మాట్లాడుతూ ప్రభుత్వం పేదల సంక్షేమానికి విశేష కృషి చేస్తూ అనేక సంక్షేమ, పథకాలు అమలు చేస్తోందన్నారు. పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిని 50 పడకల నుంచి వంద పడకలకు పెంచడం ఎంతో గొప్ప విషయమన్నారు. రాబోయే రోజుల్లో ఈ ఆసుపత్రికి సంబంధించి రోడ్ల సమస్య, సిబ్బంది సమస్యలు లేకుండా వెంటనే పరిష్కరించడం జరుగుతుందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో పేదలందరికీ ఇంటి పట్టాలు పంపిణీ చేసే బృహత్తర కార్యక్రమానికి ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. ఇంటి పట్టాలు పొందిన వారందరికీ సచివాలయాల ద్వారా రిజిస్ట్రేషన్లు చేయించి పేదలకు ఒక భరోసా కల్పించామన్నారు. ప్రభుత్వం అందజేసిన ఇంటి స్థలంలో ప్రతి ఒక్కరూ ఇల్లు నిర్మించుకొని సంతోషంగా జీవించాలన్నారు. ఎవరు కూడా ఇంటి పట్టాను అమ్ముకోకుండా ఒక ఆస్తిలా స్థిరస్థాయిగా నిలుపుకోవాలన్నారు. ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ పీలేరు పట్టణంలో 50 పడకల ప్రభుత్వాసుపత్రిని వంద పడకు మార్చుకోవడం ప్రతి ఒక్కరూ గర్వించదగ్గ విషయమని పేర్కొన్నారు. వైద్యులు రోగులకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి కుల, మత, ప్రాంత భేదాలు లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిచ్చారని పేర్కొన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా పథకాలను ఇంటి ముంగిటకు చేర్చారన్నారు. కార్యక్రమంలో ఎపి మైనార్టీ కమిషన్ చైర్మన్ ఇక్బాల్ అహ్మద్, ఆర్‌డిఒ రంగస్వామి, పీలేరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ డాక్టర్లు, వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అధిష్టానం నిర్ణయాన్ని గౌరవించాలి

- టిడిపి ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి-మదనపల్లి

అధిష్టానం నిర్ణయాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని టిడిపి ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. గురువారం స్థానిక టిడిపి పార్లమెంట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తంబళ్లపల్లె నియోజకవర్గం టిడిపి అభ్యర్థిగా దాసరిపల్లె జయచంద్రారెడ్డిని ఖాయం చేసినట్లు స్పష్టం చేశారు. అధినేత నారా చంద్రబాబు నాయుడు పలు రకాలుగా సర్వే నిర్వహించి జయచంద్రారెడ్డి సమర్థుడని, ఆయనే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిపై గెలవడం ఖాయమని ఆయనకే టికెట్ కేటా యించారన్నారు. కొంతమంది స్వార్థపరులు జయచంద్రారెడ్డికి పెద్దిరెడ్డి కుటుం బంతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని సోషల్ మీడియాలో దుష్ప్రచారాలు చేస్తున్నారన్నారు. తంబళపల్లి నియోజకవర్గ టిడిపి శ్రేణులు వీటిని నమ్మవద్దని కోరారు. తంబళ్లపల్లె అభివృద్ధి చేయడం, అక్కడ అరాచక పాలన పోవాలంటే జయచంద్రారెడ్డిని గెలిపించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే శంకర్ యాదవ్‌ను చంద్రబాబు పిలిపించుకొని సముదాయించారని, పార్టీ అధికారంలోకి వస్తూనే సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. త్వరలో శంకర యాదవ్ సహకారంతో జయచంద్రారెడ్డి ప్రచారం చేసేలా చర్యలు చేపడతామన్నారు. సమావేశంలో తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాంచినబాబు, రాజంపేట పార్లమెంటరీ నాయకులు ఆర్జే వెంకటేష్, దొర స్వామి నాయుడు, ఎస్.ఎ.మస్తాన్, బిసి నాయకులు శ్రీరాములు, మాజీ సర్పంచ్ పటాన్ ఖాదర్‌ఖాన్, హోటల్ శంకర్, రెడ్డి ప్రసాద్ పాల్గొన్నారు.

టిడిపి టికెట్ 'బత్యాల'కే...?

రాజంపేట, రైల్వేకోడూరులో అనుచరుల సంబరాలు


బత్యాలను సన్మానిస్తున్న అనుచరులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట అసెంబ్లీ టిడిపి టికెట్ ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బత్యాల చెంగల్రాయుడికే వరించినట్లు సమాచారం. గురువారం బత్యాల పట్టణంలోని బలిజపల్లె గంగమ్మ ఆలయం వద్ద ఆయన అనుచరులు, అభిమానులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. టిడిపి కార్యకర్తలు, బత్యాల అనుయాయులు ఆలయం వద్ద బాణాసంచా పేల్చి పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నారు. టికెట్ రేసులో ఉన్న టిడిపి రాజంపేట పార్లమెంటు అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు, ప్రముఖ పారిశ్రామికవేత్త గంటా నరహరి, మేడా విజయ శేఖర్‌రెడ్డి, పోలి సుబ్బారెడ్డి పేరు మీద ఐవిఆర్ ఫోన్ కాల్స్ వచ్చాయి. అయితే చివరకు బత్యాలకే టికెట్ వరించినట్లు తెలుస్తోంది. వారం రోజుల్లో టిడిపి అధిష్టానం అధికారికంగా ప్రకటించనున్నట్లు సమాచారం. ఈ కారణంగానే బత్యాల బలిజపల్లి గంగమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ఎన్నికలకు రంగం సిద్ధం చేసుకుని ముందుకెళ్లనున్నట్లు తెలుస్తోంది. రాజంపేట, రైల్వేకోడూరులోని బత్యాల చెంగల్రాయుడు వర్గీయులు, అభిమానులు గురువారం పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నారు.

'కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలు'


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

ప్రజాశక్తి - ఓబులవారిపల్లి

మండలంలో మంగపేట ఎపిఎండిసి త్రివేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలని సిఐటియు యూనియన్ పిలుపునిచ్చారు. గురువారం కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మైనింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు పి.శ్రీనివాసులు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, కార్మికుల పోరాడి సాధించుకున్న 42 కార్మిక చట్టాలను, నాలుగు కోడ్‌లుగా తెచ్చి పెట్టుబడుదారులకు అనుకూలంగా మార్చారని పేర్కొన్నారు. 8 గంటల పనిని 12 గంటలకు పెంచడం, ఓవర్ టైం తీసివేయడం, బోనస్‌ను కుదించడం, కార్మిక సంఘాలను నిర్వీర్యం చేయడం, తదితర చట్టాలు దుర్మార్గంగా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే బిజెపి అధికారంలో ఉన్న రాజస్థాన్ లాంటి రాష్ట్రంలో అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. కొన్ని కార్మిక సంఘాల నాయకులు ఈ ప్రమాదాన్ని గుర్తించకుండా సమ్మెను పూర్తి భాగస్వామి కాకుండా, తప్పుదోవ పట్టిస్తున్నారని తెలిపారు. కార్మిక వర్గం ఆలోచించి కార్మికుల సమస్యల కోసం పోరాడే సంఘం సిఐటియులో చేరి బలోపేతం చేసి, సమస్యల పరిష్కారం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.చంద్రశేఖర్ , ఎపిఎండిసి పోరాట కమిటీ జెఎసి కన్వీనర్ ఆర్.వెంకటేష్, సురేంద్ర, శివకుమార్, శంకర్ రాజు, శ్రీనివాసరెడ్డి, వెంకట్ రాజు, గున్న, డ్రైవర్లు, ఆపరేటర్లు, కార్మికులు పాల్గొన్నారు.


చైర్మన్ సురేంద్రను సన్మానిస్తున్న గిరిజన నేతలు

ట్రైకార్ చైర్మన్‌ను కలిసిన గిరిజన నేతలు

ప్రజాశక్తి - రాయచోటి

ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ తెగల కో-ఆపరేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ గుండా సురేంద్రను గురువారం పట్టణంలోని స్టేట్ గెస్ట్ హౌస్‌లో గిరిజన నేతలు కలిశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుక్కే విశ్వనాథ నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 16 లక్షల పై చిలుకు గిరిజన తెగలు నివాసమున్న మైదాన ప్రాంతానికి గిరిజన ముద్దుబిడ్డకు చైర్మన్ పదవి రావడంఆనందదాయకమని తెలిపారు. మైదాన ప్రాంతంలో ఉండే గిరిజనుల స్థితిగతులు చాలా దుర్భరంగా ఉన్నాయని, కనీసం ఒక అసెంబ్లీ, పార్లమెంటు సీటు కానీ లేకపోవడం దౌర్భా గ్యమని చెప్పారు. ఇప్పటికైనా మైదాన ప్రాంతానికి రాజకీయ పరంగా చట్టసభలలో అవకాశం కల్పించాలని, ఆ దిశగా ప్రభుత్వంతో మాట్లాడాలని తెలిపారు. ఇప్పటికీ గిరిజన్ల పైన జరుగుతున్న భౌతిక దాడులను అరికట్టాలని పేర్కొన్నారు. రాజకీయంగా ఆర్థికంగా, సామాజికంగా చైతన్యం నింపేలా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో లంబాడ సంఘం జాతీయ నాయకులు శంకర్ నాయక్, డిస్టిక్ కోపరేటివ్ సొసైటీ డైరెక్టర్ మాలే వెంకటరమణ , ఇఒపిఆర్‌డి టంగుటూరి సురేష్ బాబు, బిజెపి నేత బొజ్జప్ప, ఎస్టియు నేత సగడాల శేఖర్, ఎరుకుల హక్కుల పోరాట సమితి నాయకులు సుధాకర్, మోహన, రమణ పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత అవసరం : ఎల్‌డిఎం

ప్రజాశక్తి - రాయచోటి : ప్రతి వ్యక్తికీ చదువుతోపాటు ఆర్థిక అక్షరాస్యత అవసరమని లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ వెంటేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని స్థానిక శ్రీ షిరిడి సాయి మహిళా డిగ్రీ కళాశాలలో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు సంద ర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి ఆదేశాల మేరకు ఈ ఏడాది 2024 ఫిబ్రవరి 26 నుంచి మార్చి ఒకటి వరకు జిల్లా వ్యాప్తంగా ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లోనూ నిర్వహిస్తున్నామని చెప్పారు. విద్యార్థులకు చిన్ననాటి నువచే పొదుపు చేయడం అలవాటు చేయాలన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సూచించే ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమంలో ఉన్న పాఠ్యాంశంలో చేర్చితే దేశంలో ఆర్థిక జ్ఞానం విస్తరించేందుకు అవకాశం ఏర్పడు తుందన్నారు. ప్రతి వ్యక్తికి, ప్రతి కుటుంబానికి ఒక ఆర్థిక ప్రణాళిక ఉండా లన్నారు. ఆదాయం ఎంత, ఖర్చు ఎంత, పొదుపు ఎంత ఏమైనా ఆర్థికంగా విపంతర పరిస్థితులు వస్తే వాటిని ఎలా ఎదుర్కోవాలో ఆలోచించాలన్నారు. అనంతరం విద్యార్థినులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వెంకటచలమారెడ్డి, కళాశాల డైరెక్టర్ మనోజ్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇందిరమ్మ అభయం చారిత్రాత్మకం : పిసిసి

ప్రజా-శక్తి రాయచోటి

ఇటీవల అనంతపురంలో నిర్వహించిన కాంగ్రెస్ ఎన్నికల శంఖారావం సభలో ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున కర్గే ప్రకటించిన మొదటి గ్యారంటీ పథకం ఇందిరమ్మ అభయం చారిత్రాత్మకమని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ అభయం పథకం పేదలకు, మహిళలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వరమని అన్నారు. రాబోవు ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఈ పథకం ద్వారా ప్రతి నిరు పేద కుటుంబానికి నెలనెలా ప్రభుత్వం రూ.5000 ఆర్థిక సాయం అందిస్తుందని చెప్పారు. ఏడాదికి రూ. 60 వేల, ఐదేళ్లకు రూ.3 లక్షల లబ్ధి అందుతుందని పేర్కొన్నారు. నేరుగా మహిళల ఖాతాలోకి డబ్బు జమ అవుతుంది. ఏ పేద కుటుంబం కూడా ఆర్థిక ఇబ్బందులు పడకూడదని కాంగ్రెస్ పార్టీ ఈ పథకాన్ని ప్రకటించిందన్నారు. వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాల డబ్బులు కలిపినా కాంగ్రెస్ ఇందిరమ్మ అభయం పథకానికి సాటి రాదని, తెలుగుదేశం ప్రకటించిన సూపర్ 6 పథకాలు కాంగ్రెస్ ప్రకటించిన ఇందిరమ్మ అభయం ముందు బలాదూర్ అని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావాలంటే రాబోవు ఎన్నికల్లో మహిళలు, పేదలు కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుకు ఓటు వేయాలని తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు. అనంతరం జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు చెన్న కృష్ణ కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి తులసిరెడ్డిని గజమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డిసిసి అధ్యక్షుడు షేక్ అల్లాబకష్, ఆపార్టీ రాష్ట్ర మైనార్టీ నాయకుడు మహమ్మద్ రఫీ, జిల్లా మైనార్టీ నాయకుడు ఆడిటర్ మన్సూర్ అలీ ఖాన్, ప్రొద్దుటూరు కాంగ్రెస్ పార్టీ బాధ్యుడు నజీర్ పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌ను సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి-మదనపల్లి

బహుజన్ యువసేన (బివైఎస్) ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయ ఎదుట ఆప్కాస్ ఉద్యోగ నియమకాలలో అవినీతికి పాల్పడి కౌన్సిల్‌ను సైతం తప్పుదావ పట్టించిన మున్సిపల్ కమిషనర్ ప్రమీలని వెంటనే సస్పెండ్ చేయాలని, అర్హులైన వారికి ఉద్యోగ అవకాశాలు ఇవ్వాలని ధర్నా చేస్తూ నిరసన తెలిపారు. అనంతరం బివైఎస్ అధ్యక్షుడు పునీత్ మాట్లాడుతూ ఉద్యోగ నియమకాలలో అర్హత లేని వారిని నియమించారన్నారు. నిబంధనలు ప్రకారం ఎవరైతే ఆప్కాస్‌లో పనిచేసి పదవి విరమణ, లేదా అకాల మరణం చెందిన వారికి ఎలాంటి బెనిఫిట్స్ గాని, పెన్షన్ గాని రాదు కాబట్టి, వారి అనంతరం వారి కుటుంబ పోషణలకై వారి కుటుంబంలో ఎవరికో ఒకరికి ఆప్కాస్‌లో ఉద్యోగం ఇవ్వాల్సి ఉంటుం దని పేర్కొన్నారు. అలాంటి అర్హత కలిగిన వారికి ఇవ్వకుండా, అవినీతికి పాల్పడుతూ సంస్థ కానీ, మున్సిపాలిటీ గాని ఎటువంటి సంబంధం లేని వారికి, మరీ ముఖ్యంగా స్థానికులు కాకుండా, ఈ జిల్లా వారే కాకుండా బయట జిల్లా వారికి, ఉద్యోగ నియామకాలు జరిగాయని, వాటి గురించి సమాచారం, సమాచార చట్టం ద్వారా వారికి వచ్చిందని, వాటికి సంబంధించిన ఆధారాలు చూపుతూ, కరోనాలో చాలా మంది ఆప్కాస్‌లో పనిచేసే వారే చనిపోయారని, వారికి ఇవ్వకుండా, సాధారణంగా కరోనాలో చనిపోయినారు మాకు ఉపాధి కల్పించండని కోరారు. కార్యక్రమంలో నాయకులు హరీష్, సుధాకర్, నవీన్, వెంకటేష్, రాజు, జగదీష్, మల్లికార్జున, శ్రీనివాసులు, కిషోర్, దేవేష్, వినయ్, శశికుమార్, ద్వారకనాథ్, సాదిక్, కిషోర్ పాల్గొన్నారు.


ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి-పీలేరు

రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు చిత్తూరు జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం పీలేరులో కళాజాత బృందంతో వీధి నాటక ప్రదర్శనలు చేశారు. గురువారం స్థానిక ఆర్టీసీ బస్టాండు, అంబేద్కర్ సర్కిల్లో జైశంకర కళాజాతా బృందంచే హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధి. రక్తదానం, సుఖ వ్యాధులపై వీధి నాటకం, పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాకారులు తమ కళా ప్రదర్శనల ద్వారా హెచ్ఐవి, ఎయిడ్స్ ఎలా వస్తుంది, ఎలా వ్యాపించదు, రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, రక్తదానం వంటి అంశాలపై అవగాహన, సుఖవ్యాధులు, చికిత్స, కండోమ్ ఉపయోగం, ఐసిటిసి కౌన్సెలింగ్ కేంద్రాలు, క్షయ వ్యాధి, వ్యాధి గ్రస్తుల పట్ల వివక్షత, చిన్న చూపు లేకుండా సమాజంలో ఎలా జీవించాలని పాటలు, నాటికల ద్వారా వివరించారు. కార్యక్రమంలో పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ పి.చంద్రశేఖర్, ఇఎన్‌టి స్పెషలిస్ట్ డాక్టర్ ఈశ్వర సురేంద్ర, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ నాగవేణి, ఐసిటిసి కౌన్సిలర్ రవి, కోర్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ మేనేజరు సుమలత, సిబ్బంది హసీనా, రాజమ్మ, సల్మాని, కళాకారులు సుధాకర్, అశోక్ కుమర్, చలపతి రాయడు, కెవి రమణ, యర్రయ్య నటించారు పాల్గొన్నారు.

మహారాజ వైద్య కళాశాల గుర్తింపు రద్దు చేయాలి : సిఐటియు



ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

విజయనగరంలోని మహారాజ మెడికల్ కళాశాల గుర్తింపు రద్దు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మహారాజ మెడికల్ కళాశాల యాజమాన్యానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కళాశాలలోపని చేస్తున్న ఉద్యోగులకు, కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఏడు డిఎలను చెల్లించాలని, వేతన ఒప్పందం వెంటనే అమలు చేయాలని, కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేయాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 1 వేతనం అడిగితే ఇవ్వకపోగా అడిగిన వారిని సస్పెండ్ చేయడం దుర్మార్గమన్నారు. ఇప్పటి వరకు తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు ఆధ్వర్యంలో సమ్మెలో చేస్తుంటే కనీసం చర్చలకు పిలవకుండా వేరే వారితో పని చేయించుకోవాలని చూడడం సరైంది కాదని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలను అమలుచేయడంతో పాటు జనవరి వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం ఇదే వైఖరి కొనసాగిస్తే భవిష్యత్తులో మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు సి.రాం బాబు, మాధవయ్య, వడ్డెర విద్యా వంతుల వేదిక జిల్లా అధ్యక్షులు కె.మా రుతి, సిద్దయ్య, శంకరయ్య, రామాంజులు, నాగరాజు, ప్రశాంత్ పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికే టిడిపి, జనసేన కలయిక

ప్రజాశక్తి-మదనపల్లి

రాష్ట్ర అభివృద్ధి కోసమే టిడిపి, జనసేన కలిసి రానున్న ఎన్నికల్లో పోటీ చేస్తున్నాయని పట్టణ అధ్యక్షులు భవానీప్రసాద్ అన్నారు. గురువారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాడేపల్లిగూడెంలో జరిగిన సభను చూసి తాడేపల్లి ప్యాలస్ దద్దరిల్లిందని చెప్పారు. రాబోయే ఎన్నికలు రాష్ట్రానికి అత్యంత కీలకమన్నారు. ప్రజలు పెట్టుకున్న కూటమి ఇది, రాష్ట్ర పునర్నిర్మాణానికి ప్రజలు చేతులు కలపాలని తెలిపారు. సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు దేవరింటి శ్రీనివాసులు, నాయకులు కత్తి లక్ష్మన్న, మేకలరెడ్డి శేఖర్, తులసీధర్ నాయుడు, యర్రబల్లి వెంకటరమణారెడ్డి, కత్తి అరుణ్, పురుషోత్తం, ప్రభాకర్, ప్రకాష్ నాయుడు, పి.శ్రీనివాసులు, రెడ్డిశేఖర్, వేణుగోపాల్ రెడ్డి, సికిందర్ పాల్గొన్నారు.



మహిళను పరీక్షిస్తున్న డాక్టర్ ప్రమోద

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-వీరబల్లి

వీరబల్లిలోని ఎస్‌డికెఆర్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో గురువారం నిర్వహించిన ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మాతృశ్రీ ఐవిఎఫ్ క్లినిక్ ఆధ్వర్యంలో విఆర్‌డిఎస్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరానికి సంతానలేమితో బాధపడుతున్న 23 మంది దంపతులు హాజరయ్యారు. ఐవిఎఫ్ స్పెషలిస్ట్, ల్యాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ వై.ప్రమోద శిబిరానికి విచ్చేసి వారందరిని ఉచితంగా పరీక్షించి, కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం డాక్టర్ మాట్లాడుతూ సంతాన లేమి కారణం స్త్రీ ,పురుషులు ఇద్దరు రావచ్చు అని తెలిపారు. ఇద్దరిని పరీక్షించాకే ఒక నిర్ణయానికి రావచ్చని చెప్పారు. మాతృశ్రీ ఐవిఎఫ్ క్లినిక్ లో అత్యధిక వసతి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఐవిఎఫ్, ఐయుఐ, ఐసిఎస్ఐ, ఎరా తదితర అన్ని రకాల అత్యధిక వసతి సౌకర్యాలు ఉన్నాయని వివరించారు. మెట్రో నగరాలకు దీటుగా ల్యామినార్ ఎయిర్‌ఫ్లో ఆపరేషన్ థియేటర్, ల్యాబ్, అనుభవజ్ఞులైన ఆంద్రాలజిస్టులు, ఎంబ్రియాలజిస్టులు అందుబాటులో ఉన్నారన్నారు. ఈ శిబిరానికి విచ్చేసిన వారందరికీ 30 రోజులు ఆస్పత్రిలో డాక్టర్ కన్సల్టేషన్ ఉచితమన్నారు. ప్రతి మంగళవారం మాతృశ్రీ ఐవిఎఫ్ క్లినిక్‌లో కూడా ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శిబిరానికి విచ్చేసిన వారందరికీ అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. బిపి, బరువు, శ్యాచురేషన్ పరీక్షించారు. కార్యక్రమంలో ఎస్‌డికె ఆర్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల డైరెక్టర్ డి.రవిశేఖర్‌రెడ్డి, విఆర్‌డిఎస్ ప్రెసిడెంట్ డి.సురేంద్రారెడ్డి, గీత, అంజలి, మాతృశ్రీ ఐవిఎఫ్ క్లినిక్ జనరల్ మేనేజర్ ఎస్.వనజ, సిబ్బంది పవన్, శీను పాల్గొన్నారు.

నేడు పశువులసంత, బస్టాండ్ గేటు వేలం

ప్రజాశక్తి-రామాపురం

మండల కేంద్రమైన రామపురంలో పశువుల సంత, బస్టాండ్ గేటుకు సంబంధించి 2024-25 ఆర్థిక సంవత్సరంలో వసూలు హక్కు కల్పించేందుకు శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు రామాపురం పంచాయతీ విస్తీర్ణ అధికారి ఆధ్వర్యంలో పాట జరుగుతుందని నల్లగుట్టపల్లి పంచాయతీ సెక్రటరీ విమల కుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాటదారుడు నల్లగుట్టపల్లి గ్రామపంచాయతీకి ఎలాంటి అప్పు ఉండకూడదని తెలిపారు. పాటదారుడు ముందుగా శనివారం పశువుల సంతకు రూ.2.50 లక్షలు , బస్టాండ్ గేటుకు రూ.50వేలు, రామాపురం మండల రెవెన్యూ అధికారిచే సాల్విన్ సర్టిఫికేట్ పొంది వేలంపాట దగ్గరకు తీసుకురావాలన్ని అన్నారు. రూ.50 వేలు, బస్టాండ్ గేటుకు రూ.30వేలు ధరావత్తులు చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని సూచించారు. పాట దారులకు పాట నిలిచిన వెంటనే మొత్తం అక్కడనే వెంటనే చెల్లిస్తామని చెప్పారు. సదరు మొత్తమును చెల్లించకపోయినచో వారి ధరావత్తులు తిరిగి చెల్లిం చబడవని అన్నారు. వేలంలో ఎలాంటి ముందు నోటీసులు లేకుండానే రద్దుచేయి అధికారము గ్రామ పంచా యతీకి ఉందని అన్నారు. పాటదారుడు స్టాంప్ డ్యూటీ చట్టం మేరకు ఐదు శాతం స్టాంపు డ్యూటీ పైకం చెల్లించి అగ్రిమెంట్ చేయించుకోవాలని తెలిపారు.

నేడు ఎంపీ మిథున్‌రెడ్డి రాక

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని కొత్త మంగంపేట ఆర్ఆర్ సెంటర్ గ్రామ పరిధిలోగల లబ్ధిదారులకు ఇంటి స్థలాల అనుభవ ధ్రువీకరణ పత్రాలను శుక్రవారం రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, ఆర్‌డిఒ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు అందిస్తారని తహశీల్దార్ శేషగిరిరావు పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్క లబ్ధిదారులు, గ్రామస్తులు, గ్రామపెద్దలు రెవెన్యూ అధికారులు పాల్గొనాలని కోరారు.

కదిరికి బస్సు సౌకర్యం

ప్రజాశక్తి - చక్రాయపేట

అద్దాలమర్రి క్రాస్ నుంచి కదిరికి వయా కోలేకనం మీదుగా గురువారం నుంచి బస్సు సౌకర్యం ఏర్పాటు చేయడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దివంగత సిఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో డబుల్ రోడ్ వేసినప్పటికీ ఉదయం ఆఫీస్ వేళల్లో బస్సు సౌకర్యం లేక అన్నిరకాల ఉద్యోగులు, వ్యాపారులు, ప్రజలు ఇబ్బందులు పడేవారు. ప్రమాదాలకు నిలయమైన కోలేకనం దగ్గర వెళ్లాలంటే ప్రాణాలు పోగొట్టుకుంటూ ఇబ్బందులు పడేవారు. ఈ విషయాన్ని ప్రజాదర్బార్‌లో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి వివరించారు. తక్షణమే ఎంపీ ఆర్‌టిసి అధికారులతో మాట్లాడి కదిరికి బస్సు సౌకర్యం ఏర్పాటు చేయించారు. బస్సు సౌకర్యం కల్పించేందుకు కృషి చేసిన ఎంపీకి పలువురు కృతజ్ఞతాభినందనలు తెలిపారు.

విద్యార్థులు మనోవికాసం పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

విద్యార్థులు ఆత్మ విశ్వాసంతోపాటు మనో వికాసాన్ని పెంపొందించుకోవాలని గౌతమి మహిళా ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ సి.బాబయ్య పేర్కొన్నారు. గురువారం ప్రొద్దుటూరు మండల పరిధిలోని గౌతమి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో గీతం నెక్సస్-2024 కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ ఎం.రామసుబ్బయ్య అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బాబయ్య మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసి వారు అందులో రాణించేందుకు కృషి చేస్తామన్నారు. కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు పోటీతత్వం, సమన్వయం వంటి అలవాట్లను అలవరచుకోవాలని సూచించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు రామచంద్రారెడ్డి, రవీంద్రారెడ్డి, కళాశాల కో-డైరెక్టర్ శైలజ, డిప్యూటీ ప్రిన్సిపల్ ప్రశాంత్ రావు, వివిధ విభాగ అధిపతులు మహమ్మద్ జబార్, బాల సుబ్బన్న, యశోదా, విజయమ్మ, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో నడుచుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని నరహరిపురం జిల్లా పరిషత్ హైస్కూల్ లో స్కౌట్స్ అండ్ గైడ్స్ నూతన యూనిట్ ప్రారంభోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా స్కౌట్ జిల్లా సెక్రటరీ ప్రమీల మాట్లాడుతూ నిస్వార్థసేవ, క్రమశిక్షణతో కూడిన స్కౌట్ అండ్ గైడ్స్ పనిచేస్తున్నారన్నారు. ప్రధానోపాధ్యాయులు నరసింహ శాస్త్రి మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు చాలా ఉత్సాహంగా స్కౌట్ అండ్ గైడ్స్‌లో ప్రవేశం పొందారన్నారు. రిటైర్డ్ డి పరేడ్ కోచ్ బాలాజీ స్కౌట్ అండ్ గైడ్స్ బాధ్యతలు వివరించారు. మరిన్ని పోటీలు, సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ రాణించాలని కోరారు. జిల్లా సహాయ కార్యదర్శి బి ఖాదర్‌బాషా, స్కౌట్ రాష్ట్ర కార్య నిర్వాహక సహాయక కార్యదర్శి ఎం లక్ష్మీశ్ హజరయ్యారు. స్కౌట్ అండ్ గైడ్స్‌లో చేరిన విద్యార్థులను సన్మానించి ప్రమాణం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గౌరీశ, కుమారి, ప్రశాంతి, మురళీకృష్ణ, విజయకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మైనార్టీలకు కౌన్సిల్లో అరుదైన గౌరవం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం గురువారం వైస్ చైర్మన్ ఖాజా మొహిద్దీన్ అధ్యక్షతన నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ భీమునిపల్లి లక్ష్మీదేవి గైర్హాజరు కావడంతో ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి మేరకు మైనార్టీ కౌన్సిలర్లకు కౌన్సిల్ సమావేశంలో అరుదైన గౌరవం లభించింది. ఆ మేరకు మైనార్టీ వర్గానికి చెందిన కౌన్సిలర్లు వద్ద ఖలీల్, కమాల్ బాషా, జిలాన్, గౌస్ ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని టిడిపి నాయకులు ముస్లిం వర్గం ఓట్ల కొరకు దగుదాటలు వైసిపి నాయకులు మాత్రం ముస్లిం పట్ల ఆదరాభిమానాలు చూపిస్తున్నారన్నారు. కౌన్సిల్‌లో వైస్ చైర్మన్లుగా బంగారు మునిరెడ్డి, ఖాజామొహిద్దీన్ కొనసాగుతున్నారు. కౌన్సిల్ చరిత్రలో ఎన్నడూ జరగని విధంగా జరగడం సంతోషకరమన్నారు. ఈ అంశంతోపాటు ప్రజలకు మేలుచేకూరేలా ఉన్న అన్ని అంశాలను వేగవంతంగా అమలు పరచాలన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే వారికి లబ్ది చేకూర్చాలన్నారు.

మరోమారు వైసిపిని ఆదరించండి : 'గడికోట'

ప్రజాశక్తి-రామాపురం

అభివృద్ధి, సంక్షేమం కోసం వైసిపి ప్రభుత్వాన్ని మరోమారు ఆదరించి గెలిపించాలని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని రాచపల్లి పంచాయతీలోని నాయనవారిపల్లి , పాలిమేరపల్లి, ఎగువ ఉప్పరపల్లి, ద్వారకానగర్, రాళ్లపల్లి, గంగానేరు క్వార్టర్స్, వడ్డేపల్లి గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి వెళ్ళిన ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తుందని అన్నారు. నియోజకవర్గంలో చెప్పినవన్నీ అమలు చేశామని అన్నారు. రాయచోటి పట్టణ అభివృద్ధికి, వైద్యశాలలు, విద్యాలయాలు, గ్రామ,వార్డు సచివాలయాలు, విలేజ్ క్లినిక్‌ల నిర్మాణానికి కృషి చేసామని అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కులాలు, మతాలు, వర్గాలు రాజకీయాలు చూడలేదని అర్హులైన ప్రతి ఒక్కరికీ మేలు జరిగిందని అన్నారు. ఓటు అడిగే హక్కు వైసిపికే ఉందన్నారు. కరువు ప్రాంతమైన రాయచోటి నియోజవర్గానికి తాగునీరు, సాగునీరు అందించేందుకు చిత్తశుద్ధి పనిచే శామన్నారు. నియోజవర్గ ప్రజలు నాలుగు పర్యాయాలు తమ బిడ్డగా నన్ను ఆదరించి ఎమ్మెల్యేగా గెలిపించారని, ఈ సారి కూడా గెలిపిస్తే నియోజ కవర్గాన్ని సస్యశ్యామలం చేస్తానని అన్నారు. ప్రతిపక్షాల అసత్య హామీలను నమ్మవద్దని అన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



శ్రీకాంత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న వైసిపి నాయకులు, కార్యకర్తలు

ప్రజలకు చేరువలో సహకార సంఘాలు



రెడ్డివారిపల్లెలో మల్టీ పర్పస్ గోదామును ప్రారంభిస్తున్న నిస్సార్ అహ్మద్

ప్రజాశక్తి-నిమ్మనపల్లి


ప్రజలకు మరింత చేరువగా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నిలుస్తుందని డిపిఒ రవిచంద్రన్, సింగిల్ విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం సింగల్ విండో ఆధ్వర్యంలో నిర్మించిన బహుళ ప్రయోజన సౌకర్య గోదాములను ఎంపిపి నరసింహులు, వైసిపి మదనపల్లి సమన్వయకర్త నిస్సార్ అహ్మద్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం గతంలో కేవలం రైతులకు రుణాలను ఇవ్వటానికి మాత్రమే ఉపయోగపడేదని అన్నారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రైతులకు అనేక విధాలుగా వ్యవసాయ సంఘాలు ఉపయోగ పడుతున్నాయని తెలిపారు. డిసిసి బ్యాంక్ ఆధ్వర్యంలో నాబార్డ్ నిధుల నుంచి ఒక్కొక్క గోదాముకు రూ.40లక్షలు వెచ్చించి రెడ్డివారిపల్లి, వెంగంవారిపల్లి గ్రామంలో ప్రజల సౌకర్యార్థం 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల బహుళ ప్రయోజన సౌకర్య గోదాములను ప్రారంభించామని అన్నారు. సింగిల్ విండో కార్యా లయం వద్ద కామన్ సర్వీస్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం, పూర్తిగా కంప్యూటరైజ్డ్ చేయడం, ప్రధాన మంత్రి భారతీయ జన ఔషధీ కేంద్రాన్ని ప్రారంభించామని పేర్కొన్నారు. సింగిల్ విండో కార్యాలయంలో బ్యాంకింగ్ సదుపాయం అందుబాటులో ఉందని తెలిపారు. రైతులకు, ప్రజలకు జనరిక్ మందులను 30 నుంచి 80 శాతం వరకు తక్కువ ధరకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ప్రజలు, రైతులు వ్యవసాయ సహకార పరపతి సంఘాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైస్ ఎంపిపి జయప్రకాశ్ రెడ్డి ఆధ్వర్యంలో కొమ్మిరెడ్డిగారిపల్లెలో రూ.4.5లక్షల మండల గ్రాంట్ నిధులతో సుమారు వంద మీటర్లకు పైగా నిర్మించపోయే సిసి రోడ్డుకు నిస్సార్ అహ్మద్ స్థానిక నాయకులతో కలిసి భూమిపూజ చేశారు. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టబోతున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సహకార బ్యాంకు ఎజిఎం చంద్రకళ, లైజనింగ్ అధికారి, ఎజిఎం వై.యోగేశ్వర్‌రెడ్డి, డిసిఒ రవిచంద్రన్, నోడల్ అధికారి సోమ శేఖర్‌రెడ్డి, వైసిపి నాయకులు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

ఇంటి పట్టాల లబ్ధిదారుల్లో ఆందోళన

- న్యాయం చేయాలని అధికారులకు విజ్ఞప్తి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ఇంటి పట్టాల మంజూరులో అవకతవకలు చోటుచేసుకున్నట్లు గురువారం ప్రజాశక్తి దినపత్రికలో వచ్చిన కథనానికి లబ్ధిదారులు గందర గోళంలో పడ్డారు. తాము కూడా రెండు రోజులు తరవాత సచివాలయానికి వెళ్లి పట్టా తీసుకొని పరిశీలిస్తే పట్టాలోని సర్వేనెంబర్ 59 లేకుండా మార్పు చేసి సర్వే నెంబర్ 1022 వేసి ఉంచారని లబ్ధిదారుడు వెంకటేష్ తెలిపారు. లెక్కపెట్టలేనన్ని పట్టాలు ఇలాగే చేశారని పలువురు లబ్ధిదారులు లబోది బోమంటున్నారు. ఈ పట్టాలన్నీ మూడో సచివాలయానికి చెందిన పట్టాలుగా ఉన్నాయని, ఈ మొత్తం వ్యవహారాన్ని మూడో సచివాలయం ఇన్‌చార్జి విఆర్‌ఒ పనేనని పలువురు లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధి కారులు మార్పు చేసిన ఇంటి పట్టాలను పరిశీలించి, విఆర్‌ఒ నుంచి వివరాలు సేకరించి తమకు మొదట కేటాయిం చిన సర్వేనంబర్‌లోని ఇంటి స్థలాలు వచ్చేలా చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు.



మార్పు చేసిన ఇంటి పట్టా

లబ్ధిదారులకు న్యాయం చేస్తాం : డిటి



నగర పంచాయతీ పరిధిలో నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకం కింద మంజూరైన ఇంటి పట్టాల్లో అవక తవకలు జరిగినట్లు వచ్చినవార్తలపై డిప్యూటీ తహ శీల్దార్ మొహమ్మద్ అన్సారి స్పందిం చారు. ఈ అంశాన్ని తహశీల్దార్ దృష్టికి తీసు కెళ్లామని, నిజంగా ఒక సర్వే నంబరులో పట్టా కేటాయించి కొట్టి వేసి మరో సర్వే నంబరు వేసి స్థలాలు కేటాయించిన లబ్ధి దారులు తమను ఆశ్రయిస్తే న్యాయం చేస్తా మని చెప్పారు. పట్టాల పంపిణీలో అవకతవకలకు పాల్పడిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. లబ్ధి దారులకు అందరికీ న్యాయం చేస్తామని ఆయన హామీనిచ్చారు.

ఇళ్ల పేరుతో పేదలను అప్పులపాలు చేశారు : 'కస్తూరి'

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గృహ నిర్మాణం పేరుతో పేదలను అప్పుల పాలు చేశారని టిడిపి ఇన్‌ఛార్జి కస్తూరి విశ్వనాధనాయుడు పేర్కొన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏడాదికి ఐదు లక్షల చొప్పున మొత్తం 25 లక్షల ఇళ్లు నిర్మించి ఉచితంగా ఇస్తానని హామీ ఇచ్చిన సిఎం మాట తప్పారని అన్నారు. ఇళ్ల పేరుతో డ్వాక్రా మహిళలు ఒక్కొక్కరి పేరుతో రూ.35వేలు చొప్పున మొత్తం రూ.3,866 కోట్లు అప్పులు తెచ్చి మహిళల నెత్తిన వేల కోట్ల అప్పులు పెట్టారని అన్నారు. టిడ్కో ఇళ్లను తాకట్టు పెట్టి పదివేల కోట్లు అప్పు తెచ్చారని రెండేళ్ల రుణ కాల పరిమితి చెల్లిపోవడంతో బ్యాంకులు నేరుగా లబ్ధిదారులకే నోటీసులు ఇస్తున్నాయని అన్నారు. టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి పేదలకు ఇవ్వలేదని అన్నారు. ఒటిఎస్ పేరుతో ఎన్‌టిఆర్, చంద్రబాబు ఉచితంగా ఇచ్చిన ఇళ్లకు బలవంతంగా పది వేల రూపాయలు జగన్ రెడ్డి వసూలు చేశారని అన్నారు. చంద్రబాబు ఐదేళ్లలో 12 లక్షల నాణ్యమైన ఇల్లు కట్టగా, జగన్ హయాంలో 10 శాతం కూడా ఇళ్లు పూర్తి చేయలేదని అన్నారు. కేంద్రం ఇచ్చిన రూ.1.80 లక్షల రూపాయలు మాత్రమే ఇచ్చి, రాష్ట్ర నిధుల నుంచి ఏమి ఇవ్వక పోవడంతో అప్పుల పాలయ్యారని అన్నారు.కట్టిన కొద్దిపాటి ఇల్లు కూడా అవినీతికి పాల్పడి నాసిరకంగా నిర్మించడం వల్ల అవి కూలి పోతున్నాయని అన్నారు. సిఎం మాత్రం ఐదు ప్యాలెస్‌లు నిర్మించుకున్నారని, ఆయన బాత్రూం ఉన్నంత కూడా పేదలకు ఇవ్వలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వాసుదేవ రెడ్డి, గండికోట సుబ్బరాయుడు, బోనాసి వెంకటసుబ్బయ్య, పిరమేష్ నగరిపాటి రేవతి, రాజశేఖర్, సిద్దేశ్వర, తేనేపల్లి చిన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కస్తూరి విశ్వనాధనాయుడు

ఆలయ పునర్నిర్మాణానికి మంత్రి పెద్దిరెడ్డి భూమిపూజ



ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలోని కన్యమడుగు, చిన్నమార్చిరెడ్డిగారిపల్లెలోని ఆవుదేవర దేవస్థానం వీరభద్ర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి గురువారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి భూమిపూజ చేశారు. శిలాఫలకాన్ని ప్రారంభిం చారు. వేద పండితులు దేవాదాయశాఖ కమిషనర్ విశ్వనాథ్, విఒ రమ ణలు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డిలకు సాంప్రదాయబద్ధంగా పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్ర త్యేక పూజలతో బాలాలయం కార్యక్రమాన్ని పూర్తిచేసి మంత్రి, ఎమ్మెల్యే చేతుల మీదుగా పునాది ఇటుకలు పేర్చి పనులు ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ శ్యామలమ్మ కుమారుడు రవిశంకర్‌రెడ్డిల గృహా నికి చేరుకున్నారు. ప్రజా ప్రతినిధులు స్థానిక నాయకులతో చర్చించారు. ప్రజా సమస్యలు అడిగి తెలుసు కున్నారు. చిన్నమార్చిరెడ్డిగారిపల్లెలో గ్రామస్తుల కోరిక మేరకు సిసిరోడ్లు ఏర్పాటుకు జడ్‌పి నిధుల నుంచి రూ.15 లక్షలు, 25 కరెంటు స్తంభాలు వెంటనే మంజూరు చేసే విధంగా సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజా ప్రతినిధులు నాయకులు కార్యకర్తలు సమిష్టిగా పనిచేసి రానున్న ఎన్నికల్లో వైసిపిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. మరో మారు ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డిని ఎన్నుకునేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మల్లయ్య కొండ మాజీ చైర్మన్ కనుగొన్న మద్దిరెడ్డి, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ సురేంద్రనాథ్, మల్లయ్య కొండ చైర్మన్ మల్‌రెడ్డి, రామ శంకర్ రెడ్డి, ఎంపిటిసి సభ్యులు మహేష్ పాల్గొన్నారు.

వార్డుల్లో సమస్యలు పరిష్కరించండి

- కౌన్సిల్ సమావేశంలో అధికార పార్టీ కౌన్సిలర్లు

ప్రజాశక్తి-మదనపల్లి

తమ వార్డుల్లో సమస్యలు పరిష్కరించండి మహాప్రభో అంటూ అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్లు షేక్ కరిముల్లా, రామిశెట్టి శివయ్య, పాల్ చంద్రశేఖర్ లు డిమాండ్ చేశారు. గురువారం కౌన్సిల్ సాధారణ సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజ కిరణ్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఏ మున్సిపాలిటీ లోనైనా సమస్యలు పరిష్కరించాలని ప్రతిపక్ష పార్టీకి చెందిన కౌన్సిలర్లు కౌన్సిల్ సమావేశంలో వారి గళాన్ని వినిపిస్తారు. మదనపల్లి మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్లు వారి వార్డుల్లో సమస్యలు పరిష్కారం కాలేదని వాపోయారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్ళాని ఫోన్ చేస్తే స్పందించడం లేదని చైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లారు. కౌన్సిలర్ షేక్ కరిముల్లా మాట్లాడుతూ మున్సిపాలిటీకి సంబంధించి 43 సచివాలయాలు ఉన్నాయని వాటిని వార్డుకు ఒకటి చొప్పున 35 సచివాలయాలుగా మార్చాలని నఅన్నారు. ఒకే సచివాలయానికి ఇద్దరు కౌన్సిలర్లు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. వర్షాలు పడకపోవడం వల్ల నీటి సమస్య వస్తుంది. శానిటేషన్ సమస్య ఎక్కువగా ఉందన్నారు. పలమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పరిష్కరించలేదన్నారు. 9వ వార్డు కౌన్సిలర్ పాల్ చంద్రశేఖర్ మాట్లాడుతూ తమ వార్డులో రోడ్లపై ఎక్కడ చెత్త అక్కడే ఉందని, కార్మికులు చెత్తను తొలగించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆరో వార్డు కౌన్సిలర్ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ ఎన్నో రోజులుగా పోరాటం చేయగా తమ వార్డుకు కమ్యూనిటీ హాల్ ఆర్‌ఒ ప్లాంట్‌ను మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్ ప్రమీల, చైర్‌పర్సన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రామశెట్టి శివయ్య మాట్లాడుతూ తమ వార్డులో నీటి సమస్య ఎక్కువగా ఉందని అన్నారు. వార్డుల్లో సమస్యల పరిష్కారం కాకపోతే ప్రజలను మా పార్టీకే ఓటు వెయ్యండని ఏ ముఖం పెట్టుకొని వెళ్లి అడగలంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కౌన్సిలర్లు సమస్యలను పరిష్కారం కోసమే అధికారులకు ఫోన్‌లు చేస్తారని అధికారులు సకాలంలో స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని చైర్‌పర్సన్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో కౌన్సిలర్లు శ్రీనివాసులు, మందపల్లి వెంకటరమణ, ఆర్ వి శివారెడ్డి, ఎస్‌వి రమణ, ఈశ్వర్ నాయక్, వసీం అక్రమ్, ముబీన, గిరిజ, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో సమస్యలు వివరిస్తున్న కౌన్సిలర్ ప్రసాద్‌బాబు



ఉద్యోగాలు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్, సిబ్బంది

ప్రాంగణ ఎంపికలో 183 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-బి కొత్తకోట

స్థానిక రంగసముద్రం రోడ్డులో గల ఆదిత్య డిగ్రీ కళాశాలలో గురువారం ఎపి స్టేట్ స్కిల్స్ డెవల ప్మెంట్ కార్పొరేషన్ సహకారంతో మెగా జాబ్‌మేళా నిర్వహించారు.ఈ మేళాకు ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషనర్ పి.ఆర్.మనోహర్ హజరై మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతికత నైపుణ్యాలను మెరుగు పరచు కోవాలని సూచించారు. 362 మందికి రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, హెచ్‌ఆర్ తదితర రౌండ్లు నిర్వ హించగా 183 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు నియామక పత్రాలను అందించారు.జాబ్ మేళాలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ ఎల్.ప్రసాద్, డిఎస్‌డిఒ బి.హరిక్రిష్ణ, కో-ఆర్డినేటర్ రేవతి,ప్లేస్‌మెంట్ ఆఫీసర్స్ బి.రాజేంద్ర, లోకేష్‌లు అభినందించారు.

ఎపిజిబి ఫీల్డ్ ఆఫీసర్‌గా హోమత

గాలివీడు : స్థానిక ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులో రెండో ఫీల్డ్ ఆఫీసర్‌గా డిసి హోమత బుధవారం బాధ్యతలు చేపట్టారని బ్రాంచ్ మేనేజర్ వెంక్రటావు తెలిపారు. పుత్తూరు నుంచి వచ్చి మొదటి సారిగా బాధ్యతలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. మండలంలో ఎపిజి బ్యాంక్ మొదటి స్థానంలోఉందన్నారు. సిబ్బంది తక్కువ ఉండడం వల్ల పని ఒత్తిడి కూడా అధికమవుతున్నదని ఇంకా కింద స్థాయి సిబ్బంది అందరూ సహకారం ద్వారా పనులను సవ్యంగా చేస్తున్నామని తెలిపారు

ఎయిడ్స్‌పై నృత్య రూపాల్లో అవగాహన

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని పూల అంగళ్ల కూడలి వద్ద గురువారం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాప్తి, నివారణ, చికిత్సపై పాటలు, నాటిక, నృత్య రూపాల్లో అవగాహన కల్పించారు. రాయలసీమ జానపద కళాకారులచే కళాజాత బృందం ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు, పిఆర్‌ఒ బాలనారాయణ, ఉమెన్స్ సెల్ విజయలక్ష్మి, ఐసిటీసీ కౌన్సిలర్ వెంకటసుబ్బయ్య, ఎస్‌టిడి కౌన్సిలర్ బాదల్ వలి, సీడీఎస్ మేనేజర్ టోపీవలి, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు, సభ్యులు, సీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు..

క్రైం కార్నర్



వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి విఎన్‌కె.చైతన్య

ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలు అరెస్టు

-229.99 గ్రాముల బంగారం, రూ.12 వేలు నగదు, స్కూటీ స్వాధీనం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో పలు దొంగతనాలకు పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి 229.99 గ్రాముల బంగారం రూ.12 వేలు నగదు, స్కూటీ స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్‌పి విఎన్‌కె.చైతన్య తెలిపారు. గురువారం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల మండల పరిధిలోని కూచివారిపల్లెలో ఓ ఇంటిలో జరిగిన దొంగతనంపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. జిల్లా ఎస్‌పి కృష్ణారావు ఆదేశాల మేరకు ప్రత్యేక పోలీసు బృందం ఏర్పాటు చేసి విచారణ చేపట్టామని పేర్కొన్నారు. అనంతపురం జిల్లా, ధర్మవరం పట్టణం, కేతిరెడ్డికాలనీకి చెందిన యనమల రామాంజనేయులు, సత్యసాయిజిల్లా, కదిరి మండలం, బి.పట్నం గ్రామానికి చెందిన యనమల ఆంజనేయులు ఇద్దరు నిందితులు దొంగతనాలు పాల్పడినట్లు సమాచారం అందిందని అన్నారు. వీరిని పట్టుకు నేందుకు పట్టణ సిఐ మద్దయ్య ఆచారి, రూరల్ సిఐ మంజునాథరెడ్డి, ఎస్‌ఐ మోహన్‌కుమార్, ఎఎస్‌ఐ ప్రసాద్ వర్మ, కాని స్టేబుళ్లు రామకృష్ణ, లక్ష్మీకర్, జనార్ధన్‌లతో ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి నిఘా ఉంచినట్లు తెలిపారు. నింది తులు ఇద్దరూ రాయచోటి నుంచి రాజంపేట వైపు వస్తుండగా వారు వస్తున్న స్కూటీతోపాటు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నిందితులు ఇద్దరూ పెనగలూరులో 2002 సంవత్సరంలో రెండుసార్లు, 2003లో రెండుసార్లు దొంగతనాలు పాల్పడ్డారని, ముద్దనూరు పోలీస్ స్టేషన్ పరిధిలో కూడా పలు దొంగతనాలు పాల్పడి తెలిపారు. రాజంపేట మండల పరిధిలోని కూచివారిపల్లిలో పట్టపగలు ఇంటిలో దొంగతనాలు పాల్పడింది కూడా వీరేనని అనానరు. దోచుకున్న ఆభరణాలు యనమల ఆంజనేయులు ద్వారా ముత్తూట్ ఫైనాన్స్, మణప్పురం వంటి కుదువ కంపెనీలలో తాకట్టు పెట్టి జల్సాలు చేసేవారని వివరించారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కేసును తక్కువ సమయంలో ఛేదించిన సిఐలు మద్దయ్యాఆచారి, మంజునాథరెడ్డి లతోపాటు ఎస్‌ఐ మోహన్ కుమార్, ఎఎస్‌ఐ ప్రసాద్‌వర్మ, కానిస్టేబుళ్లు రామకృష్ణ, లక్ష్మీకర్, జనార్ధన్‌లను ఎస్‌పి ప్రత్యేకంగా అభినందించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ప్రజాశక్తి-గాలివీడు

రోడ్డు ప్రమాదంలో అన్నమయ్య జిల్లా వైసిపి సోషల్ మీడియా కో-కన్వీనర్ మలసాని భరత్‌కుమార్ రెడ్డి(25) మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. గురువారం సాయంత్రం 4గంటలకు భరత్‌కుమార్‌రెడ్డి రాయచోటి నుంచి గాలివీడుకు బైక్‌పై వస్తుండగా బోయపల్లి వద్ద రోడ్డుపై ట్రాక్టర్‌ను తప్పించబోయే క్రమంలో కింద పడి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు. భరత్ ఆకస్మిక మృతి చెందడంతో మండలంలో విషాధచాయలు అలుముకున్నాయి. పార్టీ కార్యక్రమాలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండే భరత్ ఇక లేరనే విషయం వైసిపి నాయకులు, కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారు. కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. భరత్ కుటుంబ సభ్యులకు మండల వైసిపి నాయకులు ప్రగాఢసానుభూతి తెలిపారు.



భరత్‌కుమార్ రెడ్డి

గొంతు కోసుకుని వ్యాపారి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-మదనపల్లి

కడుపు నొప్పి తాళలేక ఓ వ్యాపారి గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం మందనపల్లిలో చోటు చేసుకుంది.ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అనంతపురం జిల్లా, కదిరి మండలం, తలుపలకు చెందిన షేక్ దస్తగిరి (56), వ్యాపార రీత్యా మదనపల్లిలోని బెంగళూరు బస్టాండులో కొంత కాలంగా నివాసముంటున్నాడని తెలిపారు. తోపుడు బండిపై చిరు వ్యాపారం నిర్వహించే దస్తగిరికి కడుపు నొప్పి అధికంగా రావడంతో భరించలేక గొంతు కోసుకొని ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డారని చెప్పారు. స్థానికులు గమనించి బాధితుడిని హుటాహుటిన జిల్లా ఆస్పత్రికి తరలించారని పేర్కొన్నారు. ఆస్పత్రి అత్యవసర విభాగం డాక్టర్లు పరీక్షించి ప్రథమ చికిత్సలు అందించారు. గొంతుపై గాయం ఎక్కువగా ఉండటంతో తిరుపతి రుయా ఆస్పత్రికి వెళ్లాలని అక్కడి వైద్యులు సూచించారని అన్నారు. ఈ ఘటనపై ఒకటో పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.